సాక్షి మహబూబాబాద్

మంగళవారం ၊ 4 ၊ జూలై ၊ 2023



ఆన్‌లైన్ చెల్లింపును ప్రోత్సహించాలి

ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపును ప్రోత్సహించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సూచించారు.

- 8లో ▸



జాతర ఏర్పాట్లకు ముందస్తు ...

2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.7^0 / 27.1^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన వైద్యురాలు



డోర్నకల్: డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు విధుల్లో చేరారు. పీహెచ్‌సీలో వైద్యుల పోస్టుల ఖాళీతో ఎదురవుతున్న ఇబ్బందులపై 'వైద్యులు కావలెను' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పీహెచ్‌సీలో వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తూ కంటి వెలుగు కార్యక్రమం కోసం జనవరి 10న డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్ సాధ్విజ విధుల్లో చేరారు.

సాక్షి స్పందన

సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి



గార్ల: సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు వైద్యులు, సిబ్బంది కృషిచేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష ఆదేశించారు. సోమవారం గార్లలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో నేటి నుంచి 12రోజుల పాటు సికిల్‌సెల్ వ్యాధిని గుర్తించేందుకు జీరో నుంచి 40 సంవత్సరాల వయసు లోపు వారికి రక్తపరీక్షలు చేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఈ వ్యాధి వంశపారపర్యంగా వస్తుందని తెలిపారు. ఆశ్రమ పాఠశాల, జిల్లా బాలికోన్నత పాఠశాలలో 50 మంది బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్, డాక్టర్ వేణుగోపాల్, హెచ్‌ఎస్‌లు ఇస్మాయిల్ బేగ్, రాధాకృష్ణ, బుజ్జమ్మ, ఏఎన్‌ఎంలు మాధవి, పద్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



గార్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్ల జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచే వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు కాలేజీల్లో పేరుకుపోయిన సమస్యలను గాలికి వదిలేసి, ప్రైవేట్ కళాశాలలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళాశాలల్లోని సమస్యలను పరిష్కరించి, మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, లేనియెడల రాష్ట్రంలో దశల వారీగా ఉద్యమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, మహేందర్, జైపాల్, కల్యాణ్, రామ్‌చరణ్, శ్యామలత, స్వప్న, వైష్ణవి, పూజిత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

చెట్లను అమ్ముకున్న సర్పంచ్‌పై ఫిర్యాదు



నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామ పాత చెరువులోని తుమ్మ, వేప చెట్లను సర్పంచ్ అక్రమంగా అమ్ముకోవడంతో రైతులు, గ్రామస్తులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులోని 30 చెట్లను సర్పంచ్ సుమారు రూ.70 వేలకు అమ్ముకోవడంపై ఐబీ డీఈ రాజుకుమార్‌కు ఫిర్యాదు చేశారు. చెట్లను పెంచాల్సిన ప్రజాప్రతినిధి అమ్ముకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఐబీ డీఈని వివరణ కోరగా.. 'చెరువులోని చెట్లను నరికి అమ్ముకున్నట్లు రైతులు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తహసీల్దార్‌కు తెలియజేసిన. వాట్సాప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులు, కలెక్టర్‌కు సమాచారం అందించింది. కలెక్టర్ ఆదేశాలతో చెరువు వద్దకు వెళ్లి చెట్లను, కర్రలను పరిశీలించి చర్యల నిమిత్తం నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని' ఆయన తెలిపారు.

ఫుల్ జోష్

ఖమ్మం సభకు భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

- మానుకోట జిల్లాపై పొంగులేటి దృష్టి
- భారీగా చేరికలకు వ్యూహాత్మక ప్రణాళిక
- సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు
- జనగర్జన సభ ఉత్సాహం నింపిందంటున్న కార్యకర్తలు

సాక్షి, మహబూబాబాద్: ఖమ్మం జనగర్జన సభ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపింది. జిల్లాలో బలమైన ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ.. నాయకులు వారిని ఆకర్షించడంలో విఫలమవుతున్నారు. అయితే ఆదివారం ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ నూతనోత్సాహం నింపిందని, కలిసికట్టుగా కదనరంగంలోకి దూకుతామని నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. ఖమ్మం సరిహద్దున ఉన్న మహబూబాబాద్ జిల్లా నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లి, సభ విజయవంతంలో కీలక పాత్ర పోషించారని అధినాయకత్వం నుంచి కితాబు అందినట్లు నాయకులు చెబుతున్నారు. కాగా త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడం, సందిగ్ధంలో ఉన్న నాయకులను పార్టీలోకి ఆహ్వానించడం.. పాత క్యాడర్‌తో మమేకమవడం వంటి ఎత్తుగడలకు పార్టీ నాయకులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు జిల్లాలోని అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీని గెలిపించేలా అడుగులు మొదలయ్యాయని పార్టీ నాయకులు అంటున్నారు.

వేలాదిగా తరలివెళ్లి..

ఖమ్మంలో జరిగిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేరిక, సీఎల్పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క పాతయాత్ర ముగింపు సభకు ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ హాజరయ్యారు. కాగా పార్టీ ప్రతిష్టాత్మకంగా భావించిన సభకు మానుకోట జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఇందులో ప్రధానంగా పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన అనుమాండ్ల ఝాన్సీరెడ్డి వందలాది వాహనాలతో తరలివెళ్లారు. అదేవిధంగా ఖమ్మం జిల్లాలో అంతర్భాగంగా ఉండి మానుకోటలో కలిసిన ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం మండలాల నుంచి కోరం కనకయ్య తమ వర్గీయులను భారీగా తరలించి బలాన్ని నిరూపించుకున్నారు. అలాగే కొత్తగూడ, గంగారం మండలాలకు ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఆమె కూడా అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులను సభకు తరలించారు. ఇక మహబూబాబాద్ నుంచి భరత్ చంద్రారెడ్డి, బెల్లయ్యనాయక్, మురళీనాయక్, బలరాంనాయక్ పోటాపోటీగా కార్యకర్తలను సభకు తరలించారు. డోర్నకల్ నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడమే తమ లక్ష్యం అంటూ చాలా కాలం తర్వాత క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటున్న మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంచంద్రనాయక్ తదితరుల సమక్షంలో భారీగా సభకు హాజరయ్యారు.

జిల్లాపై పొంగులేటి నజర్

ఖమ్మం జిల్లాలోని పదికి పది స్థానాలు గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగ సభతో తన సత్తా చాటారు. అయితే ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాపై కూడా పొంగులేటి దృష్టి సారించినట్లు ప్రచారం. జిల్లాలో గార్ల, బయ్యారం మండలాలు ఉన్న ఇల్లెందు నియోజకవర్గంలో తన అనుచరుడు కోరం కనకయ్యను గెలిపించుకోవడం అనివార్యమైంది. అంతేకాకుండా డోర్నకల్‌లో కాంగ్రెస్‌ను గెలిపించడమే ధ్యేయంగా ఇప్పటికే పావులు కదుపుతున్న సురేందర్‌రెడ్డి తన అనుచరులు, పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారితో వెళ్లి పలుమార్లు పొంగులేటిని కలిశారు. అదేవిధంగా మహబూబాబాద్ నుంచికూడా ఆశావహులు పొంగులేటి వద్దకు వెళ్లి ఆశీస్సులు కావాలని అడిగినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు కూడా తన సహాయ సహకారాలు ఉంటాయని, ఆ రెండు అసెంబ్లీ స్థానాల్లో పాగా వేయాల్సి అవసరం ఉందని ఆయన అన్నట్లు సమాచారం.

చేరికలకు ప్రణాళిక..

కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఇతర పార్టీల నుంచి భారీగా చేరికల ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే డోర్నకల్ నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన సీనియర్ నాయకుడు ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్నాడు. అతడు ఖమ్మం సభలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు సమాయత్తం కాగా.. చివరి నిమిషంలో ఆగిపోయినట్లు తెలిసింది. అయితే ఇది తాత్కాలికమేనని.. ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని పార్టీ పెద్దలు అంటున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. వీరు ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినట్లు సమాచారం.



భద్రకాళీ.. శరణం మమ

మహాశాకంబరిదేవిగా దర్శనం..



చారిత్రక శ్రీభద్రకాళి దేవాలయంలో తిథిమండల దేవతాయజన పూర్వక శాకంబరి నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. అలంకరణలో నాలుగు టన్నుల కూరగాయలు, పండ్లు, దుంపలను వినియోగించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గత నెల 19వ తేదీ ఆషాఢ శుద్ధ పాడ్యమి సోమవారం ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కో క్రమంలో పూజలందుకుంటూ ఆషాఢ శుద్ధ పౌర్ణమి సోమవారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరిదేవిగా భక్తులను అనుగ్రహించింది.

- హన్మకొండ కల్చరల్

- వివరాలు 8లో ▸

మళ్లీ గుడిసెల తొలగింపు

- గుడిసెవాసులు, పోలీసుల మధ్య తోపులాట



జేసీబీతో గుడిసెలను తొలగిస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమీపంలోని సర్వే నంబర్ 255/1 ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీసుల సాయంతో సోమవారం ఉదయం తొలగించారు. గుడిసెలను తొలగించేందుకు వచ్చిన పోలీసులకు, గుడిసెవాసులు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. గుడిసెవాసులను అడ్డుకొని జేసీబీల సాయంతో గుడిసెలను నేలమట్టం చేశారు. ఈక్రమంలో జరిగిన తోపులాటలో పోలీసులు, గుడిసెవాసులకు స్వల్ప గాయాలయ్యాయి. తోపులాటలో కిందపడిపోయిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అధికారులు ఎన్నిసార్లు తొలగించినా.. తిరిగి గుడిసెలు వేస్తామని గుడిసెవాసులు అన్నారు. ఈ ఘటనలో కొంత మంది గుడిసెవాసులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పది మందిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: గుడిసెల తొలగింపు సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న టౌన్ ఎస్సై వి.దీపిక, ఇతర పోలీస్ సిబ్బందిపై గుడిసెవాసులు దాడి చేసిన ఘటనలో పది మందిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ఎస్.రవి సోమవారం తెలిపారు. బండోజు సునీత, అజ్మీరా జ్యోతి, గుండోజు నాగలక్ష్మి, వేల్పుల శైలజ, పాలిశెట్టి కవిత, దేవనబోయిన పద్మ, బానోత్ సునీత, గోపి సునీత, కిన్నెర ధనమ్మ, సందెపట్ల ఉమా అనే మహిళలు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారన్నారు. టౌన్ ఎస్సై వి.దీపిక, పోలీస్ సిబ్బంది వారిని ఆపేందుకు ప్రయత్నిస్తుండగా సదరు మహిళలు తిడుతూ దాడి చేశారని తెలిపారు. ఎస్సై దీపిక ఫిర్యాదు మేరకు పదిమంది మహిళలపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గిరిజన రైతుల జీవితాల్లో వెలుగులు

- పోడు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే



పోడురైతుకు పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

బయ్యారం: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చి వారి జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని ఇసుకమేధి, మిర్యాలపెంట, లక్ష్మీపురం, నారాయణపురం, కంబాలపల్లి, కోయగూడెం, అల్లిగూడెం, జగతారావుపేట, కస్తూరినగర్, నామాలపాడు గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బిందుతో కలిసి పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టాల పంపిణీతో గిరిజన రైతుల చిరకాల కోరిక తీరిందన్నారు. గతంలో వానాకాలం వచ్చిందంటే పోడురైతులు భయం..భయంగా పంటలు సాగుచేసేవారిని, నేడు పోడు పట్టాలు రావడంతో ధైర్యంగా సాగుచేసుకునే హక్కు సీఎం కేసీఆర్ కల్పించారన్నారు. పట్టాలు ఇవ్వడమే గాక వారికి రైతుబంధు, రైతుబీమాతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు వర్తింపజేసి సీఎం కేసీఆర్ వారికి దేవుడిగా నిలిచారన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీపీ మౌనిక, వైస్ ఎంపీపీ గణేష్, ఎంపీడీఓ చలపతిరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ మండల కోఆర్డినేటర్ ఉప్పలయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: ఆదివాసీ, గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. సోమవారం మండలం లోని బాలాజీతండాలో పోడు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని 470 మంది ఆదివాసీ, గిరిజన రైతులకు 1407.25 ఎకరాల భూమి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శివాజీచౌహాన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్‌లు శంకర్, ధరావత్ సక్రు, శ్రీను, మోతీలాల్, ఎంపీటీసీ నాగరాజు, కోఆప్షన్ ఖదీర్, తహసీల్దార్ వీరన్న, ఎంపీడీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ శశాంక



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో స్వచ్ఛత పారామీటర్స్‌ను స్పెషల్ అధికారులు పరిశీలించాలన్నారు. ఈజీఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు సంక్షేమ హాస్టల్స్, స్కూల్స్‌లో విద్యార్థుల హాజరుశాతం పెంచేలా దృష్టి సారించాలని సూచించారు. పోడు పట్టాల పంపిణీ, గ్రూపు–4 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో 2021–22 జిల్లా అన్ని శాఖలకు సంబంధించిన గణాంకాల పుస్తకాన్ని కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్ ఆవిష్కరించారు. గ్రీవెన్స్‌కు 113 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రసన్నరాణి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- డోర్నకల్ మండలానికి చెందిన అనిత కొత్తగా రేషన్‌కార్డు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంది.
- గూడూరు మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి తన పేరుపై ఉన్న సర్వే నంబర్ 37/3/18లోని పట్టాభూమిని సర్వే చేసి హద్దులు పెట్టాలని కోరాడు.
- జిల్లా కేంద్రం కొండపల్లిగోపాల్‌నగర్‌కాలనీకి చెందిన బానోత్ అశోక్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్‌లో ఎక్స్‌రే టెక్నీషియన్‌గా పని చేస్తున్నానని, ఆస్పత్రి ఐసీయూ విభాగంలో ఖాళీగా ఉన్న రేడియోగ్రాఫర్ పోస్టుకు బదిలీ చేయాలని దరఖాస్తు అందజేశాడు.
- తొర్రూరు మండలానికి చెందిన బొల్లికొండ రవి తన కుమారుడికి మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో 8వ తరగతిలో అడ్మిషన్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు



ధర్నా చౌక్ వద్ద మాట్లాడుతున్న వీరయ్య

నెహ్రూసెంటర్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోవడం పేదల హక్కు అని, వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ సుంకరి వీరయ్య అన్నారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక, గుడిసెవాసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట వారసురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో గుడిసెల పోరాటం కొనసాగుతోందన్నారు. పేదలకు కలెక్టర్, ఎమ్మెల్యే అండగా ఉండి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్న వారిపై సివిల్ కేసులు నమోదు చేస్తూ పేదలపై మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. గూడు కోసం గుడిసెలు వేసుకున్న వారిపై అక్రమంగా కేసులు పెట్టి, లాఠీలు ఝులిపిస్తూ జైలుకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన 38వ ఆర్టికల్ ప్రకారం ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని ఏర్పాటు చేయడంలో అధికారులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు గునిగంటి రాజన్న, ఆకుల రాజు, మండ రాజన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సూర్నపు సోమయ్య, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, ఆంగోత్ వెంకన్న, దుడ్డెల రాంమ్మూర్తి, గాడిపల్లిప్రమీల, బొల్లం అశోక్, శ్రీనివాస్, కుర్ర మహేష్, పాపారావు, కోటయ్య పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్‌గా ఓంకార్

నెహ్రూసెంటర్: తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్‌గా దొంతోజు ఓంకార్, కోకన్వీనర్‌గా గునిగంటి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్ సోమవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించగా జిల్లా కన్వీనర్, కోకన్వీనర్‌ను ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఓంకార్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు.

పట్టాల పంపిణీ పూర్తి చేయాలి

- వీసీలో సీఎస్ శాంతికుమారి

నెహ్రూసెంటర్: లబ్ధిదారులకు వారంలోగా పోడు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. పోడుపట్టాల పంపిణీ, డబుల్ బెడ్రూం ఇళ్లు, ధాన్యం నిల్వలు, ఫర్టిలైజర్ స్టాక్, విత్తనాల పంపిణీ, హరితహారంపై హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోడుపట్టాల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయని, దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నూతన పోడు పట్టాదారులకు రైతుబంధు అందేలా చూడాలన్నారు. జిల్లాలోని మిల్లుల్లో ధాన్యం నిల్వలు, సామర్థ్యాలపై తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హరితహారం కార్యక్రమం చేపట్టాలన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి పనులు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ చెన్నయ్య

మహబూబాబాద్ రూరల్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఈనెల 1నుంచి 31వ తేదీ వరకు జరిగే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక, విద్యా, బాలల రక్షణ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పోస్టర్లను అడిషనల్ ఎస్పీ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. అలాంటి పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పిల్లలతో ఎవరైనా బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రత్యేకంగా ఒక ఎస్సై, నలుగురు పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. వారితో పాటు వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తారన్నారు. అధికారులు సమష్టిగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బాలకార్మికులను చూసినప్పుడు 1098 లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డిప్యూటీ పర్యవేక్షకులు డాక్టర్ వెంకట్ లకావత్, డీఎస్పీ గంద్రాతి మోహన్, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నెహ్రూసెంటర్: పోడు పట్టాల పంపిణీ, సీజనల్ వ్యాధులు, హరితహారం, బీసీ రుణాల ఎంపికపై ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి సోమవారం జిల్లాలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోడు పట్టాల పంపిణీలో వేగం పెంచాలన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మండలం, గ్రామస్థాయిలో సీజనల్ వ్యాధులపై సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. బీసీ కులాల రూ.లక్ష రుణాల దరఖాస్తులను ఎంపీడీఓలు త్వరగా వెరిఫికేషన్ చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క.. మొక్కకు నీరు పోసి..



ముందు మురిపించిన వరణుడు ఇప్పుడు ముఖం చాటేశాడు. గత నెలలో కురిసిన వర్షానికి మండంలోని రైతులు పత్తి, మక్కజొన్న విత్తనాలు నాటారు. అప్పటినుంచి వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి మొక్కను బతికించుకోవడానికి బిందెలతో నీరు తెచ్చి మొక్క.. మొక్కకు పోస్తున్నారు. - కొత్తగూడ

క్లుప్తంగా

ఎర్రబెల్లికి కేసీఆర్ ఆశీస్సులు..



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జన్మదినాన్ని (మంగళవారం) పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. మంత్రి ఎర్రబెల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు. అలాగే కేబినేట్ సమావేశం అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కూడా మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఏటా తన జన్మదిన వేడుకలను విదేశాల్లో జరుపుకుంటున్న మంత్రి దయాకర్‌రావు.. సోమవారం రాత్రి అమెరికా బయలుదేరారు.

బీసీలు ఎదగకుండా కుట్ర..



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

నయీంనగర్: బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ బీసీ సంఘాల ఉద్యమకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందూర్ జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు.. బీసీ కులాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముదిరాజ్ కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వంటి వారిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, రజక సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు నాగవెల్లి సురేష్, బట్టి శ్యాం యాదవ్, తాళ్ల సంపత్, మేర సంఘం నాయకుడు మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



మహా శాకంబరిదేవిగా దర్శనం..

- ముగిసిన ఉత్సవాలు
- పులకించిన భక్తులు

హోమం మహాపూర్ణాహుతి



సీపీ దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ



భద్రకాళీ.. శరణం మమ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భద్రకాళి శరణం మమ అంటూ పులకించిపోయారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పార్నంది నరసింహామూర్తి, చెప్పెల నాగరాజుశర్మ , టక్కరసు సత్యం, సోమసుందరశర్మ తదితరులు అలంకరణలో పాల్గొన్నారు. ఉదయం మితాక్రమంలో, చిత్రాక్రమాలలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. శాకంబరీ అలంకరణలో ఐదు టన్నుల 80 రకాల దుంపలు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, 70 రకాల పండ్లను వినియోగించారు. మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ , స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది నాగులు, చింతశ్యామ్ సుందర్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను నిర్వహించారు. భద్రకాళి సేవాసమితి అధ్యక్షుడు అయితా గోపినాథ్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రముఖుల సందర్శన..

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి దంపతులు, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, నగర సీపీ రంగనాథ్ దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్– పద్మ దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

- పలువురికి తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్
- కాపాడిన స్థానికులు
- లారీ డ్రైవర్ పరిస్థితి విషమం

దామెర: వేగంగా వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం ఉదయం హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పరకాల డిపోకు చెందిన ఏపీ 36 జడ్ 0256 నంబర్‌గల ఆర్టీసీ బస్సు బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళ్తోంది. హనుమకొండ నుంచి పరకాల వైపునకు వస్తున్న టీఎస్ 07 యూసీ 8979 నంబర్‌గల లారీ ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఈ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా సుమారు ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ భద్రయ్యలో క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. పోలీసులు, స్థానికులు సుమారు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అదే విధంగా లారీ డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారిని దామెర క్రాస్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కాగా, లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్లమేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై రాజేందర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలికి పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు కండక్టర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.



బస్సు డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యకు సహకరించిన గోపాల్‌నగర్ చెందిన పస్తం ధర్మయ్య, పస్తం జగన్నాథంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు విచారణను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే మరికొంత మందిని కూడా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం..

- గంట వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



కొమురయ్య గౌడ్ (ఫైల్)



సదానందం గౌడ్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. అన్న కాలుకి ముల్లుకుచ్చుకుంటే తమ్ముడు.. తమ్ముడి కంట్లో నలుసు పడితే అన్న విలవిలాడుతారు. కష్టసుఖాల్లో ఇరువురు పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. అలాంటి వీరి బంధాన్ని ఎవరూ విడదీయలేరు. చివరకు మరణం కూడా. దీనికి నిదర్శనమే ఈ ఘటన. వరంగల్ గణేశ్‌నగర్‌కు చెందిన ఉమ్మగాని కొమురయ్య గౌడ్ (80), వరంగల్ ఎల్‌బీనగర్ తిలక్ రోడ్డుకు చెందిన ఉమ్మగాని సదానందం గౌడ్ (65) అన్నదమ్ములు. వీరు గీత (గౌడ) వృత్తిని చేపట్టి కుటుంబాలను చక్కగా పోషించుకునే వారు. వారికి జన్మించిన పిల్లలను ఉన్నతంగా చదివించారు. కుమార్తెలు, కుమారుల వివాహం చేయగా వారు ప్రస్తుతం ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తాము సంతోషంగా ఉండాలని కోరుకునే సమయాన ఇటీవల అన్నదమ్ములు అనారోగ్యానికి గురయ్యారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చిక్సిత పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొమురయ్య మృతిచెందగా.. గంట వ్యవధిలోనే తమ్ముడు సదానందం తుది శ్వాస విడిచాడు. దీంతో మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నరేందర్ సోమవారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

వివాహితపై లైంగిక దాడి

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన ఓ వివాహితపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భీమారానికి చెందిన సంగాల ప్రవీత్, శరత్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటన వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఫహీమా, ఆయూబ్(57) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరి వివాహాలు అయ్యాయి. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఆయూబ్ సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సాంబయ్య ఘటనా స్థలిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ

- గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

ఎస్‌ఎస్‌తాడ్వాయి : 2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోడు పట్టాల పంపిణీ అనంతరం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో మహాజాతర ఏర్పాట్లు, నిధుల మంజూరుపై రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ కృష్ణ ఆదిత్య.. మంత్రి సత్యవతిరాథోడ్‌కు వివరించారు. రూ.75 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు ఇంటి పనిగా భావించి మేడారం మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను దీవించాలని వనదేవతలను వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం మేడారంలో రూ. కోటి 25లక్షలతో నిర్మించిన రెవెన్యూ అతిథిగృహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, అధికారులతో కలిసి ప్రారంభించారు. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి, జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

పీఆర్‌సీ అమలు చేయాలి

- మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నియామకమైన 80 మంది బోధనేతర, ఇతర ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్ర అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ఉస్మానియా, కాకతీయ, తెలుగు, శాతవాహన, జేఎన్‌టీయూ మహాత్మా గాంధీ, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, తెలంగాణ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో అమలవుతుందన్నారు. కాని కేయూలో మాత్రం 2013లో నియామకమైన 80 మంది ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీనిపై స్పందించి తమకూ వర్తింపజేయడంతోపాటు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, ఇవే సమస్యలపై శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ యాదగిరి, వల్లాల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ శూకూర్, పి. కొమురయ్య, ఎతిరాజుల సతీశ్ బాబు, పి. అంకూశ్ పాల్గొన్నారు.



విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడు?

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

కేయూ క్యాంపస్: జూలై 8వ తేదీన వరంగల్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడో చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్య క్షుడు గోవిందు నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేయూ అతిథి గృహంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్సీ వర్గీకరణ విషయంలో చొరవ తీసుకుని ప్రధానితో ప్రకటన చేయించాలని కోరారు. కాగా, ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఈ నెల 7వ తేదీతో 29 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా 29వ ఆవిర్భావ మహాసభను వరంగల్‌లోని ఓ సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధుకర్, ఎంఎస్‌పీ జాతీయ నేత కడార్ల నవీన్ చారి, గోవిందు శాంతి కుమార్, ప్రేమ్ కుమార్, దూడపాక వెంకటేష్, జన్నే భాస్కర్, పెండ్యాల నిశాంత్, ప్రశాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరివికాస్‌లో పెండింగ్ ఉన్న సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అలాగే, కాలిన, ఆగిన మీటర్లను మార్చాలన్నారు. సంవత్సరం పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. దత్త గ్రామాల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి వాటికి మీటర్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, కె.కిషన్, కె.ఎస్.గుట్ట, రాజుచౌహాన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు..

అతివేగం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం ఫలితంగా రహదారులు రక్తమోడాయి. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ స్కూల్ బస్సు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఓ యువకుడు, ఇదే జిల్లాలోని జమాండ్లపల్లి బ్రిడ్జి సమీపంలో కారుకు కుక్క అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో వాహనం పొలాల్లోకి దూసుకెళ్లగా వ్యక్తి, హనుమకొండ హంటర్ రోడ్డులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

బైక్‌ను మరమ్మతు కోసం తీసుకువస్తుండగా బస్సు ఢీకొని యువకుడు మృతి..

మహబూబాబాద్ రూరల్: తన ద్విచక్రవాహనం పాడైపోగా.. మరమ్మతు చేయించేందుకు తీసుకువస్తున్న క్రమంలో స్కూల్ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. టౌన్ ఎస్సై గోపి కథనం ప్రకారం మహబూబాబాద్ మండలం లక్ష్మీపురం తండా జీపీ పరిధిలోని గమ్యతండాలో నివాసం ఉండే బానోత్ రాజు.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ అనిల్‌కుమార్ (19) బంధువులు. అనిల్ కుమార్ వారం క్రితం రాజు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం పాడవడంతో మరమ్మతు చేయించడానికి ఆటోకు తాడు కట్టి అదే వాహనంపై మహబూబా బాద్‌కు వస్తున్నారు. ఆటో, ద్విచక్రవాహనం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథిగృహం వద్దకు చేరుకోగా వారి వెనుక నుంచి వచ్చిన విజ్‌డమ్ (తక్షశిల) పాఠశాల బస్సు అనిల్‌కుమార్ వాహనాన్ని ఢీకొంది. దీంతో యువకుడు బైక్‌పై నుంచి కిందపడగా.. బస్సు అతడి తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



అనిల్‌కుమార్ (ఫైల్)

కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు.. అపస్మారక స్థితికి వెళ్లి ఒకరు..

మహబూబాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయిన కారు.. అదుపుతప్పి బోల్తాడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తన్నీరు శ్రీనివాస్ (58).. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొంతకాలంగా వరంగల్‌లోని గిర్మాజీపేట విశ్వకర్మ వీధిలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చక్రధర్ డ్రైవింగ్ చేస్తుండగా శ్రీనివాస్ పక్కనే కూర్చున్నారు. కారు.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరి దుర్మరణం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ గాయత్రీనగర్‌కు చెందిన బొంతు అఖిల్ (23), ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కొలెపాక శ్రీకాంత్(29).. బైక్‌పై వరంగల్ నుంచి హన్మకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌పంపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై బొంతు అఖిల్ బావ పెరుమాండ్ల అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు.





యువకుల మృతదేహాలు